తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
20 సెప్టెంబర్ 2026

# పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన ఉద్ధృతం...

- **కళాశాలకు తాళం.. అధ్యాపకులను అడ్డుకున్న విద్యార్థులు**





**జహీరాబాద్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని, ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రంజోల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళన శనివారం ఉద్ధృతమైంది. 36 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తున్న విద్యార్థులు.. శనివారం కళాశాలకు తాళం వేసి అధ్యాపకులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను నిర్వీర్యం చేస్తూ కొత్త జీవోల పేరుతో ప్రైవేటీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థులు ఆరోపించారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

**సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ...**

విలీన ప్రతిపాదన, జీవో 97కు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించారు. పరీక్షలు రాయాలని అధ్యాపకులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు అంగీకరించలేదు. తమ ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు పరీక్షలకు హాజరుకాబోమని తేల్చిచెప్పారు. పరీక్షలను బహిష్కరిస్తూ కళాశాల ప్రాంగణంలోనే ఆందోళన కొనసాగించారు.

**నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల సంఘీభావం...**

విద్యార్థుల ఆందోళనకు అధ్యాపకులు కూడా సంఘీభావం తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా కొనసాగించాలని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# నాడు గెలుపు కై.. నేడు అభివృద్ధి కై

**పాపన్నపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** నాడు మెదక్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం పల్లె బాట పట్టిన యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నేడు గ్రామాల అభివృద్ధి కీ మరోమారు విస్తృతంగా పల్లెల్లో పర్యటిస్తున్నారు. శనివారం పాపన్నపేట మండల కేంద్రంలో, పాత లింగాయిపల్లి, కొత్త లింగాయి పల్లి, కొంపల్లి, కొడపాక గ్రామాల్లో నాయకులతో కలిసి బోరు మోటార్లను ప్రారంభించారు. డాక్య తండా లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడను ప్రారంభించారు. పొమ్లా తండా ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



చేశారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. సర్పంచులు పావని గౌడ్,స్వప్న హీరాలాల్, సిద్దప్ప, కాంగ్రెస్



పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంతప్ప, ఖలీమ్, భూమన్న, కిష్టయ్య,గౌస్, మల్లప్ప, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**నారాయణపేట, సెప్టెంబర్ 19(జనంసాక్షి):**

నారాయణపేట రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్ ను ఎన్నికల అధికారి ప్రసాదరావు శనివారం విడుదల చేశారు.ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి1గంటల వరకు నామినేషన్ల స్వీకరణ 25న నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

26న ఉదయం 10 నుంచి 1గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.3 గంటల తర్వాత అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు. అభ్యర్థుల మధ్య పోటీ లేకుంటే అభ్యర్థుల సంఖ్య 15 మంది లోపు ఉంటే ఏకగ్రీవంగా ఫలితాలను ప్రకటిస్తామన్నారు.15 కు మించి అభ్యర్థులు పోటీలో ఉంటే అక్టోబర్4 న ఉదయం 8 నుంచి 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు.ఆ వెంటనే ఓట్ల లెక్కింపు జరుగుతుందనీ ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

## మహిళపై దాడి చేసిన హోంగార్డుపై చర్యలు తీసుకోవాలి




**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**

హఫీజ్‌పేట్‌లో మహిళపై దాడికి పాల్పడినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తున్న రైల్వే హోంగార్డును సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇండి యన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గేబాబు డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళను కొట్టి, జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల భద్రత, గౌరవానికి భంగం కలిగించే ఘటనలను ఉపేక్షించరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ఓంప్రకాష్, యం.ఏ.ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.



# చినుకు కోసం నేల చూపులు!

- **వర్షం కోసం ఆకాశం వైపు రైతుల చూపులు**
- **ఎండ తీవ్రతకు వాడిపోతున్న పంటలు.. పొలాల్లో తగ్గుతున్న తేమ**
- **37.2 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు**
- **28 శాతం లోటు వర్షపాతం.. రైతుల్లో పెరుగుతున్న ఆందోళన**

**కోహిర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చినుకు కోసం నేల చూపులు చూస్తోంది.. వాన జాడ కోసం రైతుల చూపులు ఆకాశం వైపు నిలిచాయి. వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతుండటంతో పంట పొలాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. సెప్టెంబర్ మాసం సగం దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సంగారెడ్డి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడంతో వర్షాధార పంటలు తేమ కోసం ఎదురుచూస్తున్నాయి. దీనికితోడు పగటి ఉష్ణోగ్రతలు 37.2 డిగ్రీలకు చేరడంతో భూమిలోని తేమ వేగంగా ఆవిరవుతోంది.

**28 శాతం లోటు.. రైతుల్లో గుబులు...**

జిల్లాలో ఇప్పటివరకు 423.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇదే సమయానికి సాధారణంగా 586.7 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా.. 163.2 మి.మీ. లోటు ఏర్పడింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే జిల్లాలో సుమారు 28 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార పంటలపై ప్రభావం పడుతోంది. పొలాల్లో తేమ తగ్గిపోవడంతో మొక్కలు నీటి కోసం తల్లడిల్లుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

**కోహిర్‌లో కరువు ఛాయలు?**

కోహిర్ మండలంలోనూ వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి, సోయాబీన్, కంది తదితర వర్షాధార పంటలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంటలకు కీలకమైన దశలో వరుణుడు ముఖం చాటేయడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది.

**వర్షం కోసం ఎదురుచూస్తూ రైతులు పొలాల వైపు..**

ఆకాశం వైపు పదేపదే చూస్తున్నారు. ఉదయం ఆకాశంలో మబ్బులు కనిపించినా వర్షం కురవకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మరోసారి మంచి వర్షం కురిసి భూమిలో తేమ పెరిగితేనే పంటలు కోలుకునే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

**ఒకవైపు ఎండ.. మరోవైపు పంటలపై ప్రభావం**

ఓ వైపు చినుకు జాడ లేకపోవడం.. మరోవైపు ఎండలు దంచికొడుతుండటంతో పంట పొలాలపై ఒత్తిడి పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు 37.2 డిగ్రీలకు చేరడంతో భూమి వేడెక్కుతోంది. నేలలోని తేమ వేగంగా ఆవిరవుతుండటంతో పంటలకు నీటి అవసరం పెరుగుతోంది. ఇప్పటికే వర్షాలు ఆలస్యం కావడం



మిగతా 5లో..

తో పంటల ఎదుగుదలపై ప్రభావం పడుతోందని రైతులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి వర్షం కురిస్తే పంటలకు కొంత ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నారు.

**పెట్టుబడులు పెట్టి.. వాన కోసం నిరీక్షణ...**

విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కూలీల ఖర్చుల కోసం రైతులు ఇప్పటికే పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొచ్చే దశలో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే పెట్టుబడులు కూడా దక్కకపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు మరింత ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని అంటున్నారు. “పంట బాగుంటుందన్న ఆశతో పెట్టుబడి పెట్టాం.. ఇప్పుడు పంట కన్నా ఆకాశం వైపే ఎక్కువగా చూస్తున్నాం” అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బోర్లపై పెరుగుతున్న ఆధారం...**

వర్షాలు సకాలంలో లేకపోవడంతో సాగు భూముల్లో తేమను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులపై రైతులు ఆధారపడుతున్నారు. అయితే ప్రతి పొలానికి సాగునీటి సౌకర్యం లేకపోవడంతో వర్షాధార రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. వర్షం

# మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పరిశుభ్రత, మౌలిక వసతులపై పరిశీలన
- పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదవాలి
- విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు ఆరోగ్య కరమైన, సురక్షిత వాతావరణం కల్పించాలని అధి కారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన అదనపు





కలెక్టర్ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, సమస్య లను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టా లని మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.



పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన మధుసూదన్ నాయక్ ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని సిద్ధం కావాలని సూచించారు. చదువుపై ఏకాగ్రత పెంచుకుని కష్టపడి చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం బేసిక్ ప్రాక్టీస్ హైస్కూల్ ఆవరణను కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో పరిశు భ్రతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమానికి అవసరమైన చర్యలను ఎప్పటి కప్పుడు చేపట్టాలని సూచించారు.

## ఎర్రగుంటపల్లి గ్రామంలో అంగన్వాడీలో పోషణ మాసోత్సవాలు



**కోహెడ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోహెడ మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో పోషణ మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ సాయి భవాని పాల్గొని కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు తీసుకోవలసిన పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. స్థానికంగా లభించే పౌష్టికాహార పదార్థాలతో వంటకాలు తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రోటీన్, ఫైబర్, విటమిన్, మినరల్స్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని వివరించారు. అందరూ సమ తుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పం చ్ భాగ్యలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి టీచర్ శెట్టి రమాదేవి, తల్లులు పాల్గొన్నారు.

## మానవహారంతో పోషణ వారోత్సవ ర్యాలీ ప్రతిజ్ఞ



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పోషణ మహోత్సవం లో భాగంగా శనివారం చిన్నశంకరంపేట మండలంలో హై స్కూల్ విద్యార్థుల తోటి పోషణ నినాదాలతో ర్యాలీ నిర్వహించి మానవహా రంతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యం లో 9వ జాతీయ పోషణ మాసం వేడుకలు మోడల్ స్కూల్ లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యాధికారి డీప్లా రాథోడ్, సి.డి.పి.ఓ స్వరూప రాణి సూపర్వైజర్ అంజమ్మలు మాట్లా డుతూ, ఈ నెల 9 నుండి అక్టోబర్ 8 వరకు ఈ పోషణ్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భీమ్లా రాథోడ్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కర్రే పోచయ్య, ప్రిన్సిపాల్ వాణికుమారి, లింగమయ్య, శ్రీనివాస్ రెడ్డి అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండకు వెలుగులు

- 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**వెల్దండ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
వెల్దండ మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంత రాయాలు తగ్గి స్థానికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొ న్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ స్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్సమోని శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్, విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు గౌడ్, లైన్‌మెన్ లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు ముదిగొండ రమేష్, పిల్లి దేవేందర్, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, కాసారపు వెంకటయ్య, మంగళగిరి శ్రీను, విద్యుత్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్, వెదురు పంటలకు ప్రభుత్వ రాయితీలు

- వెదురు, ఆయిల్‌పామ్‌తో రైతులకు అదనపు ఆదాయం
- ఆయిల్‌పామ్‌కు 90 శాతం రాయితీ
- ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఆయిల్‌పామ్, వెదురు సాగుకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు తెలిపారు. కోహీర్ మండలం పైడిగుమ్మల్‌లో రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో వెదురు సాగుపై అవగాహన సదస్సు, ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అధికారులు పంటల సాగు విధానాలు, ప్రభు త్వ రాయితీలు, ప్రయోజనాలను రైతులకు వివరిం చారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి, తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు, అదనపు ఆదాయం పొందా



లని సోమేశ్వరరావు సూచించారు. జాతీయ వెదురు మిషన్‌లో భాగంగా పొలం గట్లపై వెదురు సాగు చేసే రైతులకు ఒక్కో మొక్కకు రూ.90, బ్లాక్ ప్లాంటేషన్‌కు ఎకరానికి రూ.14,400 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కలను 90 శాతం రాయితీతో అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొదటి నాలుగేళ్లపాటు అంతర పంటల సాగు, పంట నిర్వ హణకు ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ఆయిల్



పామ్ తోటల్లో కోకోవాను అంతర పంటగా సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు.

ఆయిల్‌పామ్‌కు నీటి వసతి కీలకమని, బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు తెలి పారు. జిల్లాలో సుమారు 4,994 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని, ప్రస్తుతం గెలల ధర టన్నుకు సుమారు రూ.24 వేల వరకు ఉందని సోమేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు సునీత రోజ్, సతీష్, కేవీకే శాస్త్రవేత్త శైలజ, గోద్రెజ్ అగ్రోవేట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి






**వడ్డేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** వడ్డేపల్లీ... రైతులు పొలంలో మందులు పిచికారి చేసే సమయంలో తప్పకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాధా అన్నారు శని వారము నాడు మండల పరిధిలోని బుడమరసు గ్రామములో మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్షన్ కపాస్ కాంతి కార్యక్రమంలో భాగంగా రైతు లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతోపాటు సాగుకు సంబం ధించి పలు విలువైన సూచనలను సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధ మహిళకు ఆశ్రమంలో ఆశ్రయం

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 19(జగన్‌సాక్షి):**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం సమీపంలో అనాథగా ఉన్న వృద్ధ మహిళకు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు స్పందించి సురక్షిత ఆశ్రయం కల్పించారు.సుమారు నాలుగు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధ మహిళను అక్కడ వదిలివెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్న ఆమెకు స్థానికులు భోజనం అందిస్తూ సహాయం చేశారు. ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి వృద్ధ మహిళను సురక్షిత





ప్రాంతానికి తరలించాలని ఫీల్డ్ స్పందన అధికారి సతీష్‌ను ఆదేశించారు. దీంతో సతీష్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని వృద్ధ మహిళకు భోజనం, దుస్తులు అందించారు. అనంతరం అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ వృద్ధుల ఆశ్రమానికి ఆమెను సురక్షితంగా తరలించి ఆశ్రయం కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, మహిళల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఎవరైనా నిరాశ్రయులుగా కనిపిస్తే వెంటనే సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వీణ, ప్రమీల, జబ్బర్, అల్తాఫ్ తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండారెడ్డిపల్లిలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం



కోహెడ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ పిల్లి బాబు ఆధ్వర్యంలో "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పూల బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ అలాగే హానికరమైన చెత్తను గ్రామ సిబ్బందితో కలిసి తొలగించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, గ్రామప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. "ప్లాస్టిక్ ను నివారిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం - ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందాం అని సర్పంచ్ గ్రామస్తులకు పిలుపునిచ్చారు.

## ఉమ్మడి వెలికట్ట హమాలీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

కొండపాక, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): వెలికట్ట క్రాస్‌రోడ్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ హమాలీలకు ప్రభుత్వ హామీలు అమలు చేయాలని, గ్రామీణ ప్రాంత కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస కూలి రేట్లు, సంక్షేమ బోర్డు, ప్రమాద బీమా, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీల శ్రమతోనే రవాణా వ్యవస్థ కొనసాగుతోందన్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బర్మా కొమురయ్య, అధ్యక్షుడిగా ఎర్రబోయిన కనకయ్య, ఉపాధ్యక్షులుగా ఇంగాల ఐలయ్య, పెరుగు నర్సింలు, కార్యదర్శిగా జంగిటి కనకయ్య, కోశాధికారిగా మార్క యాదయ్య ఎన్నికయ్యారు.

# పసిబిడ్డకు పునర్జన్మనిచ్చిన శిశురక్ష వైద్యులు

- వైద్యులను అభినందించిన జగ్గారెడ్డి..
- ఆసుపత్రి బిల్లులో సగం మినహాయింపు

సంగారెడ్డి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): నెలలు నిండకముందే కేవలం 980 గ్రాముల బరువుతో జన్మించిన ఓ పసిబిడ్డకు సంగారెడ్డిలోని శిశురక్ష చిల్డ్రన్స్ ఆసుపత్రి వైద్యులు 50 రోజులపాటు అత్యాధునిక వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో పాటు కిడ్నీలు పనిచేయకపోవడంతో శిశువుకు వెంటిలేటర్‌పై చికిత్స అందించడంతో పాటు డయాలసిస్ నిర్వహించారు. వైద్యుల కృషితో ప్రస్తుతం శిశువు ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడి 1.6 కిలోల బరువుకు చేరుకుంది.



వైద్యులను అభినందించిన జగ్గారెడ్డి...

శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి, తల్లిదండ్రులను పరామర్శించి, వెంటనే పసిబిడ్డను శిశురక్ష ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం శిశువు ఆరోగ్యం మెరుగుపడిన విషయం తెలుసుకున్న ఆయన స్వయంగా ఆసుపత్రికి వెళ్లి వైద్యులను, యాజమాన్యాన్ని అభినందించారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సంగారెడ్డిలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించి పసిబిడ్డ ప్రాణాలను కాపాడటం అభినందనీయమని జగ్గారెడ్డి అన్నారు. వైద్యులు శిశువును కంటికి రెప్పలా కాపాడి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం నింపారని పేర్కొన్నారు.

**బిల్లులో సగం మినహాయింపు....**

శిశువుకు 50 రోజులపాటు అందించిన చికిత్సకు రూ.4 లక్షలకు పైగా బిల్లు కాగా, తల్లిదండ్రులు రూ.2 లక్షల వరకు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని తాను చెల్లిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం మానవతా దృక్పథంతో బిల్లులో సగం మొత్తాన్ని మినహాయించినట్లు వెల్లడించారు.

## హవేలీ ఘనపూర్‌లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



హవేలీ ఘనపూర్ మండలం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం' ఐదు అంశాలు - ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయంను గడపగడపకు తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కల్వకుంట్ల కవిత నాయకత్వంలో కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. నాయకులు ఇప్పా రమేశ్, ఎండీ జునైద్, భాను, ప్రేమ్, మధు కార్తీక్, రాజశేఖర్, నవీన్ తదితరులు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే భావి తరాల ఆరోగ్యం




హవేలీ ఘనపూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): కూచన్‌పల్లి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా 'ABC 3.0-Stronger Minds, Safer Futures' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాల బాలికల ఆరోగ్యం, భద్రత, విద్య, సమానత్వం, బాల్య వివాహాల నివారణ, సోషల్ మీడియా ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాచారం మధు మోహన్ మాట్లాడుతూ పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణం సాధ్యమన్నారు. విద్యార్థులు పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏసీడీపీఓ సల్మా, షీ టీం, ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లపై అదనపు ఎస్పీ పరిశీలన

మెదక్ మండలం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): వినాయక నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ శనివారం కొంటూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కొంటూర్ చెరువు వద్ద నిమజ్జనానికి అనుకూలంగా చేసిన ఏర్పాట్లతోపాటు బారికేడింగ్, విద్యుత్ దీపాలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. నిమజ్జన సమయంలో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు. చెరువు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని అదనపు ఎస్పీ తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన భద్రతా సూచనలు అందించాలని ఆదేశించారు.



అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించేలా సంబంధిత శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భక్తులు, ప్రజలు పోలీసు అధికారులు సూచించే భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించి, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని అదనపు ఎస్పీ కోరారు. అదనపు ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ కృష్ణమూర్తి, ఎస్ఐ సుమన్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా సర్పంచ్ బంటు విద్యాసాగర్ జన్మదిన వేడుకలు



కోహీర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): చింతల్‌గట్టు గ్రామ సర్పంచ్ బంటు విద్యాసాగర్ 35వ జన్మదిన వేడుకలను మిత్రులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. విద్యాసాగర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉండే విద్యాసాగర్‌తో తమ అనుబంధాన్ని మిత్రులు గుర్తుచేసుకున్నారు. వేడుకలతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖలీల్, సంగన్న పాటిల్, జి.రాజు, సుధాకర్, యేసురత్నం, నర్సింలు, విజయ్‌కుమార్, మధుకర్, నాగన్న, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత చర్యలు

## కొల్చారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

కొల్చారం, సెప్టెంబరు 19(జనంసాక్షి): కొల్చారం పోలీస్‌స్టేషన్‌ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ముఖ్య రికార్డులు, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని, బ్యాంకులు, ఏటీఎంలు, ప్రధాన కూడళ్ల వద్ద పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో రూరల్ సీఐ ఎం.కృష్ణమూర్తి, ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.




## తాడూరులో వినాయక ఊరేగింపులో గొడవ

ఉప్పునుంతల, సెప్టెంబర్ 19(జనంసాక్షి): ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన వినాయక విగ్రహ ఊరేగింపులో ఇరువర్గాల మధ్య గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఉప్పునుంతల ఎస్ఐ పి. మహేష్ పేర్కొన్నారు.

వినాయక చవితి, ఇతర పండుగల సందర్భంగా డీజే ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ముందస్తుగా పోలీస్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసినా, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా నిర్వహించినా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత



**హత్నూర, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసు కోకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం ప్రదే శాల పర్యవేక్షణలో భాగంగా శనివారం హత్నూర మండలంలోని బోర్పట్ల, దౌల్తాబాద్ గ్రామా ల్లో ఏర్పాటు చేసిన వినాయక మండ పాలను సందర్శించడంతో పాటు వాటిని నిమజ్జనం చేసే ప్రదేశాలను పరిశీలించారు. సంబంధిత పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు సమన్వ యంతో పనిచేస్తూ భక్తులకు,ఉత్సవ నిర్వాహ కులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతా వరణంలో జరిగేలా చూడాలని వారు సూచిం చారు. నిమజ్జన ప్రదేశం లో గజ ఈతగాళ్లు లాంటి రక్షణ వ్యవస్థతో పాటు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు,క్రేన్లు తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. వినాయక ఊరేగింపులో ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు తావివ్వకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. వారి వెంట జిన్నారం సిఐ రమణారెడ్డి, తహసీల్దార్ ఫర్హీన్ షేక్,ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, వివిధ అధికారులు ఉన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**హత్నూర, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చట్టాలు, న్యాయపరమైన సేవలపై విద్యా ర్థులు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ సౌజన్య అన్నారు. మండలంలోని సిరిపుర గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ విభాగం సంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం న్యాయ శిబిరం నిర్వహించారు. ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్,పోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ చట్టాలను విపులంగా విశదీకరించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పం చి భూపాల్ రెడ్డి,ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉప సర్పంచ్ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకరావుపల్లి తండాలో విద్యుత్ సౌకర్యం

- నూతన స్తంభాలు, వైర్ల ఏర్పాటు





**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో/పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పెద్దకొత్తపల్లి మండలం వేడుకరావుపల్లి తండాలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు తండా లోని వివిధ కాలనీలకు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వైర్లు గుంజే పనులు చేపట్టారు. కొన్ని కాలనీల్లో స్తంభాలు, వైర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విష యాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. దీంతో అవసర మైన ప్రాంతాలను గుర్తించి పనులు ప్రారం భించారు. ప్రతి కాలనీకి విద్యుత్ అందించ డమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు నాయ కులు తెలిపారు. నూతన స్తంభాలు, వైర్ల ఏర్పాటుతో తండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు వర్నదేవి శీనునాయక్, మహేష్‌నాయక్, జి.శంకర్ యాదవ్, నరసింహాచారి, మల్లేష్‌యాదవ్, శ్రీరాములు నాయక్, రాములు నాయక్ తది తరులు పాల్గొన్నారు.

## వీరాపూర్‌లో ఘనంగా పోషణ మాసోత్సవం



**బెజ్జంకి,సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** బెజ్జంకి మండలంలోని వీరాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బేగంపేట సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ సుశీల ప్రత్యేక సమావేశం నిర్వహించి చిన్నారులకు అన్నప్రాసన,గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,సూపర్‌వైజర్ నాగరాణి,ప్రధానోపాధ్యాయుడు భార్గవ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మాదాసు లత,విజయశ్రీ,ఆయా గ్రామాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు,వీఓఏలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25వ వార్షిక అన్నప్రసాదానికి సిద్ధం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండల కేంద్రంలో శ్రీ సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న వార్షిక మహా అన్నప్రసాదం 25వ సంవత్సరంలోకి అడుగుపెడు తోంది. గణేష్ నవ రాత్రుల్లో భాగంగా ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2002లో రాజయోగి వెం కటస్వామి చేతుల మీదుగా ప్రారంభమైన అన్నప్రసాద కార్యక్రమం భక్తులు, దాతల సహకారంతో 24 ఏళ్లుగా కొనసాగుతోంది. రజ తోత్సవం సందర్భంగా ఈసారి మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు పచ్చటి అరటాకుల్లో పంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజయోగి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై ఆశీస్సులు, ఆధ్యా త్మిక సందేశం అందించనున్నారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

## లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్‌కు సన్మానం



**తెలకపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడిగా అతినారపు వెంకటేష్ నియమితులైన సంద ర్భంగా మండల కేంద్రంలో శనివారం అభినందన, సన్మాన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వెంకటేష్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి లేబర్ సెల్‌ను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుం డా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శి రాజు, రమేష్, నరసింహ, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్ని గణపయ్య లడ్డును వేలంలో దక్కించుకున్న చిన్నారి



**రాజాపూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామంలో చిన్నా రులంతా కలిసి గణపతిని తమ కాలానిలో ఏర్పాటు చేసి, పంచా రాత్రులు పూజలు నిర్వహించి, నిమజ్జనం చేయడానికి ముందు గణపతి లడ్డును వేలం వేయగా చిత్తనూరి యశస్వి 5వేల రూపాయ లకు దక్కించుకున్నది. ఈ కార్యక్రమంలో చిన్నారులు మను, అన్ను, అఖిల్,తేజ,శశిధర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## పోషక మాసంలో ఆరోగ్యంపై అవగాహన



**మల్దకల్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పోషక మాసంలో భాగంగా మల్ద కల్‌లో మహిళలు, చిన్నా రుల్లో పోషక లోపాలు, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయ లు, చిరుధాన్యాలు, మొక్కల పెంపకం, పోషకాహార విలువలను బొమ్మల ప్రదర్శన ద్వారా వివరించారు. అన్నప్రాశన, పౌష్టికాహార కార్యక్ర మాలు నిర్వహించారు. సీడీపీఓ ఆకాష్ దీప్తి మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి శిశువు రెండేళ్ల వరకు వెయ్యి రోజులపాటు పౌష్టికాహారం తీసుకోవడం అవసరమన్నారు. తల్లిపాలు పిల్లల ఎదుగుదలకు కీలకమని తెలి పారు. అంగన్‌వాడీల్లో అందించే గుడ్లు, పాలు, బాలామృతం తీసు కోవాలని సూచించారు. కార్యక్ర మంలో సర్పంచ్ చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్స్-2027కు ఉచిత శిక్షణ

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** తెలంగాణకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు యూపీఎస్సీ సివిల్స్-2027కు ఉచిత శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీ దేవి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీస్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 23 సాయంత్రం 6 గంటల వరకు గడువు ఉంది. సెప్టెంబర్ 27న స్క్రీనింగ్ పరీక్ష, అక్టోబర్ 5 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. డిగ్రీ అర్హతతో పాటు కుటుంబ వార్షిక ఆదా యం రూ.3 లక్షల్లోపు ఉండాలి. పరీక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి శిక్షణ, స్టడీ మెటీరియల్, వసతి, భోజనం, గ్రంథాలయ సదుపాయం కల్పిస్తారు. దరఖాస్తులను welfare.sriramsias.comలో చేసుకోవాలని సూచించారు.

## ఇస్లాంపూర్‌లో వ్యక్తి హత్య







**తూప్రాన్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇస్లాంపూర్‌లో శుక్రవా రం రాత్రి కొండపురం శ్రీరాములు (50) హత్యకు గురయ్యాడు. పోలీ సుల వివరాల ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తు లో శ్రీరాములు భార్య, పిల్లలతో గొడవపడి దాడికి పాల్పడటంతో పాటు గ్యాస్ సిలిండర్ విడుదల చేసి చంపుతానని బెదిరించాడు. ఈ క్రమంలో భార్య సవిత, కుమారుడు భరత్ అతడి కళ్లలో కారం చల్లి, కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐలు గంగరాజు, జ్యోతి, సీఐ వెంకటరాజ గౌడ్, డీఎస్పీ నరేందర్ గౌడ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దోమల నివారణకు మందు పిచికారి



**శివ్వంపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా శివ్వం పేట గ్రామపంచాయతీ ఆధ్వ ర్యంలో దోమల మందు పిచి కారి కార్యక్రమం చేపట్టారు. మాజీ జడ్పీటీసీ పబ్బా మహేష్ గుప్తా సహకారంతో 5 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్ లో మందు కలిపి గ్రామంలోని అన్ని వీధుల్లో పిచికారి చేశారు. సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ నాయ కులు, పీఎంజీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## రెండు తలల దూడ జననం



**బెజ్జంకి,సెప్టెంబర్ 19,(జనంసాక్షి):** బెజ్జంకి మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబ మోహన్‌రావుకు చెందిన గేదెకు శనివారం రెండు తలల దూడ జన్మించింది. ఈ ఘటన స్థానికంగా ఆసక్తికరంగా మార దంతో దూడను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జన్యుపర మైన కారణాలతో ఇలాంటి దూడలు జన్మించే అవకాశం ఉంటుందని వెటర్నరీ వైద్యులు తెలిపారు. రెండు తలలతో దూడ జన్మించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన ముస్త్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని



**చేర్యాల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చేర్యాల మండలంలోని ముస్త్యాల తెలంగాణ మోడల్ స్కూల్లో చదువుకున్న విద్యార్థిని అక్షయ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-19 బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం తో జిల్లా అండర్-19 జట్టులో స్థానం సంపాదించారు. ఈ సందర్భం గా విద్యార్థిని అక్షయను పాఠశాల ప్రిన్సిపల్ రాంబాబు, అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అభినందించి రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

## జూరాల వద్ద రైతుల మహాధర్నా



**ఆత్మకూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** జూరాల ప్రాజెక్టు నుంచి వెంటనే నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు మహాధర్నా నిర్వహించారు. సీపీఎం, బీజేపీ రైతు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జూరాల సామర్థ్యం 9.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8 టీఎంసీలకు పైగా నీరు ఉన్నా సాగుకు విడుదల చేయడం లేదని నాయకులు ఆరోపించారు. పంటలకు పెట్టుబడులు పెట్టిన రైతులు నీరందక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ధర్నా వద్దకు వచ్చి నచ్చజెప్పినా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైతులే కాలువకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జబ్బర్, జీఎస్ గోపి, కొండయ్య, అయ్యంగారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చినుకు కోసం నేల చూపులు!

పడితేనే పంటలు నిలబడే పరిస్థితి ఉండటంతో రైతుల ఆశలన్నీ వరుణుడిపైనే ఉన్నాయి.

**మబ్బులు కనిపిస్తే చాలు..**

ఆకాశంలో మబ్బులు కమ్ముకున్న ప్రతిసారీ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందా అని ఎదురుచూస్తున్నారు. కానీ మబ్బులు కమ్ముకుని చినుకులు పడకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

ఒక్క మంచి వర్షం కురిస్తే పొలాల్లో తేమ పెరిగి వాడిపోతున్న పంటలకు ఊపిరి వస్తుందని రైతులు అంటున్నారు.

**మరింత ఆలస్యమైతే ముప్పే...**

వర్షాభావ పరిస్థితులు మరికొంతకాలం కొనసాగితే వర్షాధార పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో వర్షం అందకపోతే సాగు ఖర్చులు భారంగా మారే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

ప్రస్తుతం కోహిర్ ప్రాంత రైతుల చూపులన్నీ ఆకాశంపైనే ఉన్నాయి. ఎండ వేడిమి నుంచి నేలకు ఉపశమనం.. పంటలకు ప్రాణం పోసే చినుకు కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరుణిస్తాడా?

పంటలు నిలబడతాయా? అన్నదే ఇప్పుడు రైతుల ముందున్న ప్రశ్నగా మారింది.

# అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆరా

- తహసీల్దార్ ఫోన్ ఎత్తడం లేదని ఆగ్రహం
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై సర్పంచుల అభ్యంతరాలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష
- వైద్య సిబ్బంది హాజరుపై ప్రశ్నలు

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఉప్పునుంతల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో వరుణ్‌తేజ్ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. అధికారులు తమ శాఖల నివేదికలను సభలో ప్రవేశపెట్టారు.

వ్యవసాయ శాఖపై సమీక్ష సందర్భంగా అర్హులైన రైతులకే ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కేఎల్ఐ నీటిపై పూర్తిగా ఆధారపడి పంటలు సాగు చేయవద్దని, నీటి లభ్యతపై స్పష్టత ఉన్న తర్వాతే పంటలు వేయాలని రైతులకు సూచించారు. విద్యుత్ శాఖపై సమీక్షలో మర్రిపల్లి ఎస్సీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 33 కేవీ లైన్‌ను తొలగించాలని, సీబీ తండాలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరారు.



**తహసీల్దార్‌పై ఆగ్రహం...**

తహసీల్దార్ అద్దంకి సునీత నివేదిక సమర్పిస్తున్న సమయంలో పలువురు సర్పంచులు ఆమెకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అధికారులు అందుబాటులో ఉండా లని, నిర్లక్ష్యం చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

**కార్యదర్శుల తీరుపై అభ్యంతరాలు...**

పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని, ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ప్రజలను తిప్పుతున్నారని సర్పంచులు ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

**ఇళ్లు, వైద్యంపై సమీక్ష...**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి అవసరమైతే మంజూరు రద్దు చేయాలని సూచించారు. మండల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా అని ఆరా తీశారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు




**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12న నిర్వహించనున్న నాలుగోవ జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,552 కేసులను పరిష్కరించి, నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 23వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత సిబ్బందిని అభినందించారు. డిసెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్బీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్, సఖికేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ పోక్సో కేసుల్లో తప్పు నిసరి నివేదికలు, బాధితుల గుర్తింపు రక్షణ, ఫాస్ట్ ట్రయల్స్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ప్రియాంక, సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ డాక్టర్. వినీత్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కం సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, డీస్పీ లింగయ్య, రెవిన్యూ డివిషనల్ ఆఫీసర్ రమేష్ , డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎం ఏ. రషీద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మా, వన్ స్టాప్ సఖి సెంటర్ కోఆర్డినేటర్ క్రాంతి రేఖ, వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అనిత, మరియు పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

- డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలి
- 15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో
- రాజీతో కోర్టు ఫీజు తిరిగి చెల్లింపు
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాకరాజు శ్రీనివాసరావు





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సుదీర్ఘంగా కొనసాగించకుండా మధ్యవర్తిత్వం ద్వారా సత్వరంగా పరిష్కరించుకుని డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బాకరాజు శ్రీనివాసరావు సూచించారు. కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్న మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89లోని ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల్లో మధ్యవర్తిత్వం ఒకటని తెలిపారు. వివాదంలోని ఇరుపక్షాలు న్యాయస్థానంలో సుదీర్ఘ విచారణకు వెళ్లకుండా, తటస్థమైన మూడో వ్యక్తి సహకారంతో పరస్పర అంగీకారానికి రావడమే మధ్యవర్తిత్వమన్నారు. మధ్యవర్తి ఇరుపక్షాలతో చర్చించి పరిష్కారానికి మార్గం చూపుతారని, అయితే తుది నిర్ణయం తీసుకునే అధికారం పక్షాలకే ఉంటుందని స్పష్టం చేశారు.

**15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు...**

వనపర్తి జిల్లాలో 15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. వైవాహిక, కుటుంబ, ఆస్తి, భూ, వినియోగదారుల, ఆర్థిక తదితర వివాదాలకు సంబంధించిన కేసుల్లో పక్షాలు మధ్యవర్తిత్వాన్ని కోరవచ్చున్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను కోర్టు కూడా మధ్యవర్తిత్వానికి పంపవచ్చని వివరించారు.

**సమయం, ఖర్చు ఆదా...**

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే భవిష్యత్ వ్యాజ్య ఖర్చులు తగ్గడంతోపాటు నిబంధనల ప్రకారం కోర్టు ఫీజు కూడా తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు. ప్రక్రియలో పక్షాలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, గోప్యంగా వెల్లడించవచ్చన్నారు. రాజీ కుదరకపోయినా మధ్యవర్తిత్వంలో వెల్లడించిన విషయాలను తదుపరి విచారణలో ఒక పక్షానికి వ్యతిరేకంగా ఉపయోగించరని పేర్కొన్నారు.

జిల్లా ప్రజలు మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వివాదాలను స్నేహపూర్వకంగా, సత్వరంగా పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు కోట్ల లావణ్య బాల్‌రెడ్డి, జి.కళార్చన, కే.కవిత, బార్ అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి వెంకటరమణ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ, శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు.

## రేవల్లిలో స్కూల్ గేమ్స్ పోటీలు ముగింపు

- విజేతలకు బహుమతులు అందజేత




**రేవల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** రేవల్లి మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా వనపర్తి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీ కుమార్, మండల అభివృద్ధి అధికారిణి కుమారి కీర్తన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. **కబడ్డీ బాలికలు:** మొదటి విజేత కేజీబీవీ రేవల్లి, రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ రేవల్లి, **కబడ్డీ బాలురు:** మొదటి విజేత జడ్పీహెచ్ఎస్ రేవల్లి, రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ నాగపూర్, **ఖో-ఖో బాలికలు:** మొదటి విజేత జడ్పీహెచ్ఎస్ నాగపూర్, రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ రేవల్లి, **ఖో-ఖో బాలురు:** మొదటి విజేత జడ్పీహెచ్ఎస్ నాగపూర్, రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ తల్పునూర్, **వాలీబాల్ బాలురు:** మొదటి విజేత జడ్పీహెచ్ఎస్ రేవల్లి, రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ తల్పునూర్ ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయని తెలిపారు.

## విద్యార్థుల ఉన్నతికి సమష్టిగా కృషి చేయాలి

• డీఐఈఓ సర్వంతోట శ్రీనివాస్

మునిపల్లి, సెప్టెంబర్ 19(జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన సర్వం తోట శ్రీనివాస్ తొలిసారిగా బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. కళాశాల జిల్లా స్థాయిలో మార్గ దర్శకంగా నిలిచేలా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషిచేస్తూ, వారు ఇష్టపడి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఎల్. సుధాకర్‌ను నియమించినట్లు తెలిపారు. ఆయన



ఆధ్వర్యంలో సిబ్బంది సమష్టి కృషితో కళాశాలను ఉత్తమ ఫలితాల దిశగా తీసుకెళ్లాలని డీఐఈఓ సూచించారు. కార్యక్రమంలో టీజీఎల్ఏ-711 రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముద్దం సిద్ధారెడ్డి, కే. మారుతి, ఉదయ ప్రసాద్, కాటి అబ్బయ్య, టి. సంజయ్, జి.రమేష్, సలావత్ రవి కుమార్, సీహెచ్. రవి, ఎస్. అనుమహిత, వై. శ్రావణ్‌కుమార్, మన్నె రమేష్, జి. కవిత, కే. హితేంద్రనాథ్ తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సమతుల ఆహారంతోనే పిల్లల అభివృద్ధి

తూప్రాన్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి): బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన పోషణ వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో మెదడు, శారీరక అభివృద్ధి మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కౌన్సిలర్ ముంద్రా త్రి లక్ష్మీ మల్లేష్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. చిరుతిళ్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిల్లలు పోషకాహారంపై పాటలు పాడి, వివిధ వంటకాలతో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి, పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు రాధా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఘనంగా ఐసీడీఎస్ పోషణ మేళా



శివ్వంపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): పోషణ మాసాన్ని పురస్కరించుకొని శివ్వంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోషణ మేళా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంఈఓ బుచ్చా నాయక్ పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే సమతుల ఆహారపు అలవాట్లు పెంచుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్న ఘనాపూర్ పాఠశాలలో ఘనంగా న్యూట్రిషన్ డే

• పౌష్టికాహారంతోనే పిల్లల ఆరోగ్యకర ఎదుగుదల
• తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి: హెచ్ఎం సత్యనారాయణ

కొల్చారం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): చిన్న ఘనాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం న్యూట్రిషన్ డే నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంట్లో తయారు చేసిన వివిధ పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించగా, ఉత్తమ వంటకాలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తికి పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. పప్పులు, గుడ్లు, పాలు, పెరుగు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో చేర్చాలని సూచించారు. గ్రామ



సర్పంచ్ మధుసూదనరెడ్డి మాట్లాడుతూ జంక్‌ఫుడ్, ప్యాకెట్‌ఫుడ్‌కు దూరంగా ఉంచి ఇంట్లో తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 22ఏ భూముల పేరుతో రైతులకు ఇబ్బందులు

• వైట్‌ఫీల్డ్ లిక్కర్ ఫ్యాక్టరీకి అనుమతిస్తే రాజీవ్ రహదారి దిగ్బంధం - బీఆర్ఎస్

బెజ్జంకి, సెప్టెంబర్ 19(జనంసాక్షి): మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.మండలంలోని పలు గ్రామాల్లో నిషేధిత జాబితా కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వే నంబర్ 386లో ఎన్ఓసీ పొందిన మాజీ సైనికుల భూములను కూడా జాబితాలో చేర్చారని ఆరోపించారు.సర్వే నంబర్ 559లో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయని, సామాన్యులకు ఒక న్యాయం,కాంగ్రెస్ నేతలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. గుగ్గిళ్ల, పోతారం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 96లో ఇథనాల్ పరిశ్రమలకు చెందిన సుమారు 17 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చకుండా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు.వైట్‌ఫీల్డ్ సంస్థ బీరు,లిక్కర్ ఫ్యాక్టరీల అనుమతుల కోసం టీఎస్-ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వైట్‌ఫీల్డ్‌లో లిక్కర్ ఫ్యాక్టరీకి అనుమతిస్తే రాజీవ్ రహదారిపై ధర్నా చేసి దిగ్బంధం చేస్తామని మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు.

**అనుమతుల విధానం సామాన్యులకు శాపం...**

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు, పట్టాలు, రుణాల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ప్రభుత్వ అనుమతుల విధానం ఇబ్బందిగా మారిందన్నారు.గతంలో ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన అనుమతులను పరిగణనలోకి తీసుకోకుండా భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆరోపించారు. 22ఏ జాబితా సమస్యపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ చర్యలకు బీఆర్ఎస్ భయపడదు అనిఅన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న,దిటి బాలనర్సు, దుమాల మహేష్, ఎల శేఖర్‌బాబు, వంగల నరేశ్, నిమ్మ వెంకట నర్సయ్య, రాగుల మహేష్, మాశం బాబు, కనగండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## కంకర పరిచారు.. బీటీ మరిచారు..

• ఏడాదిగా ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు



మక్తల్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మండల పరిధిలోని బిజ్వార్ గ్రామం నుండి కొత్తపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ తెలిపారు. సుమారు ఏడాది క్రితం కోటి 90 లక్షల రూపాయల నిధులతో డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారని తెలిపారు. అయితే, గుత్తేదారులు కేవలం రోడ్డుపై కంకర వేసి అలాగే వదిలేయడంతో సుమారు ఏడాది గడుస్తున్నా తారు (బీటీ) రోడ్డు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ?కంకర తేలిపోవడంతో ఆ దారి



గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ద్విచక్ర వాహనదారులు తరచూ కిందపడి గాయాలపాలవుతున్నారని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రోడ్డు నిర్మాణం చేపడుతున్న గుత్తేదారులు వెంటనే స్పందించి, కంకర రోడ్డుపై తక్షణమే బీటీ రోడ్డు వేయాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఇరు గ్రామాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుని సన్మానించిన గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

మిడ్జిల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన లక్ష్మయ్య ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శనివారం మండల పరిధిలోని దోనూరు గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ సమావేశం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... దోనూర్ పాఠశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో సంతోషకరమన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి సంతోషకరంగా ఉందని. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దోనూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారా సింగ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, అంజలి, ప్రేమలత విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## చెరువు హద్దులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

• మత్స్యకారుల హక్కులను కాపాడాలి: తుమ్మల అలోజి

బిజినేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మంగనూరు గ్రామంలోని కొత్తకుంట సికం భూమి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నల్లమట్టి తవ్వి చెరువు హద్దులు తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల అలోజి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మత్స్య సహకార సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు అక్రమంగా పట్టాలు చేసుకుని నల్లమట్టి కోసం భూములను విక్రయించారని, అనంతరం మత్స్యకారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 16 ఎకరాల భూమికి సంబంధించిన కొనుగోలు, విక్రయ వివరాలను అధికారులు పరిశీలించాలని కోరారు. జీవో ఎంఎస్ 168 సెక్షన్ 3 ప్రకారం చేపలు పట్టే హక్కు మత్స్యకారులకే ఉందన్నారు. వాల్టా చట్టం 2002 ప్రకారం చెరువుల



హద్దులు మార్చడం, చేపల వేటను అడ్డుకోవడం నేరమని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్, ఇరిగేషన్ ఈఈ, జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో గూడకాశన్న, బోలా కృష్ణయ్య, పి.నరసింహా, ఇంద్ర మల్లికార్జున్, చింతకాయల యాదయ్య, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథుడి సేవలో కంటా రెడ్డి తిరుపతి రెడ్డి

చిన్న శంకరంపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథునికి టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆశించాలన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భక్తులకు అన్నదానం వడ్డించారు ఈ సందర్భంగా గ్రామస్తులు తిరుపతి ఆప్యాయతంగా పలకరించి కాసేపు ముచ్చటించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టీఆర్ఎస్ నాయకుడు కుమార్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపిటిసి ప్రసాద్ గౌడ్, సర్పంచ్ బందారు నాగభూషణం,ఉప సర్పంచ్ రాజు, సురేష్ గౌడ్, లింగంరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



**బెజ్జంకి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** రేగులపల్లి గ్రామంలో 'సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జంగిలి లక్ష్మీ తిరుపతి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్ ప్రారంభించారు. ప్రధాన కూడళ్లు, ముఖ్య ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్ఐ తోట తిరుపతి మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలను సమర్థంగా కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గైని త్రిశూల్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకెళ్లాలి



**శివ్వంపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలకు చేరి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ బుచ్చా నాయక్, రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ సూచించారు. పాంబండ ఉన్నత పాఠశాలలో 2018లో దాత లక్ష్మీ మైసయ్య యాదవ్ ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహానికి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. గురువుల సూచనలు పాటిస్తూ కష్టపడి చదవాలని మైసయ్య యాదవ్ కోరారు. హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాలికలు, మహిళల రక్షణపై అవగాహన



**తెలకపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పెద్దపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్‌లో భరోసా సెంటర్ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ సునీత, భరోసా సెంటర్ నిర్వాహకురాలు శ్రావణి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించి ఆత్మవిశ్వాసంతో స్వయం ఆధారితంగా ఎదగాలని సూచించారు. బాలురు క్రమశిక్షణతో మెలగాలని, లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎంఈఓ, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బాలబాలికల పెంపకంలో తల్లిదండ్రులు వివక్ష చూపకుండా సమాన శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

## రోగి సహాయకులకు అన్నప్రసాద పంపిణీ



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** వినాయక చవితి సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గణపతికి ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్‌ఎంవో డాక్టర్ కె.ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సంగీత ఆధ్వర్యంలో రోగి సహాయకులకు అన్నప్రసాద పంపిణీ చేపట్టారు. ఆసుపత్రికి వచ్చే రోగులు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 1,500 మందికిపైగా అన్నప్రసాదం స్వీకరించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

- లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల స్వాగతం
- వెంట పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు





**కొల్లాపూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (87) మృతిచెందడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎత్తం గ్రామ శివారులోని బీరం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కేటీఆర్.. లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డిని ఆలింగనం చేసుకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. లక్ష్మారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతిచెందగా, శుక్రవారం ఎత్తం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కేటీఆర్ శుక్రవారం అంత్యక్రియలకు హాజరవుతారని పార్టీ వర్గాలు పేర్కొన్నప్పటికీ, ఆయన హాజరుకాలేకపోయారు. దీంతో శనివారం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

కేటీఆర్ రాక సందర్భంగా అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్ కొల్లాపూర్‌కు బయలుదేరగా మార్గమధ్యంలోనూ కార్యకర్తలు ఆయనను కలిసేందుకు, అభివాదం చేసేందుకు ఉత్సాహం చూపారు.

కేటీఆర్ వెంట మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆశన్నగారి జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం కేటీఆర్ చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు నివాసానికి వెళ్లారు.

### వార్డు మెంబర్ల ఫోరం
## మండల అధ్యక్షుడిగా కార్తిక్ రెడ్డి



**చేర్యాల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చేర్యాల మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా జూపల్లి కార్తిక్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న వార్డు మెంబర్లకు కార్తిక్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షులుగా కొలిపాక మధు, కొమిరె భవాని, దేవులపల్లి శ్రీకాంత్, పోలోజు సుమన శ్రీ, ప్రధాన కార్యదర్శులుగా నుకల నరేష్, శీర్ల శ్రీకాంత్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యదర్శులు, కోశాధికారి, గౌరవ సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## వెల్దండలో కొత్త బజాజ్ పల్సర్ బైక్ ఆవిష్కరణ





**వెల్దండ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** 'పల్లె పల్లెకు పల్సర్ బండి' కార్యక్రమంలో భాగంగా వెల్దండ మండల కేంద్రంలో కొత్త బజాజ్ పల్సర్ బైక్‌ను శనివారం ఆవిష్కరించారు. షోరూం నిర్వాహకులు జగన్‌గౌడ్, పర్యవేక్షకుడు రాఘవేందర్‌గౌడ్ ఆహ్వానం మేరకు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బజాజ్ పల్సర్ 125, 150 సీసీ మోడళ్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కొత్త మోడల్ ప్రత్యేకతలను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బస్సమోని శ్రీను ముదిరాజ్, నాయకులు కానుగుల జంగయ్య, నిరంజన్, ప్రభాకర్, పోలె అశోక్, డీలర్ వెంకటయ్య, తిరుపతిరెడ్డి, మట్ట విష్ణుగౌడ్, భీమరాజు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## రక్తదానం.. ఒక ప్రాణానికి పునర్జన్మ

- ఈ నెల 22న సంగారెడ్డిలో రక్తదాన శిబిరం



**సంగారెడ్డి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** టీయూడబ్ల్యూజే (ఐజేయు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదినం సందర్భంగా ఈ నెల 22న సంగారెడ్డిలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఐబీ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు శిబిరం ప్రారంభం కానుంది. శిబిరానికి టియుడబ్ల్యూజే (ఐజేయు) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పుట్టినరోజు వేడుకలను వ్యక్తిగత కార్యక్రమంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే సంకల్పంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి రక్తదాతలు అండగా నిలవాలని కోరారు. ఆరోగ్యవంతులైన యువత, పాత్రికేయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. "మన బలం.. మన కలం.. మన రక్తం.. ఒకరి ప్రాణం" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు



**కృష్ణ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** కృష్ణా నదిలో గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై నవిద్ తెలిపారు. నిమజ్జన మార్గంలో వీధి దీపాలు, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నది వద్ద గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్‌జాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఫైర్, విద్యుత్ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీసులను అప్రమత్తం చేశామని తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్సై నవిద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషోర్, పంచాయతీ కార్యదర్శి రఘుస్వామి, గ్రామ సహాయకుడు తిమ్మరాజు పాల్గొన్నారు.

## పాంచ జన్య సంకల్ప సభను విజయవంతం చేయాలి



**నారాయణపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పాంచ జన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినొళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

మధ్యాహ్నం 2 గంటలకు కోస్గి జూనియర్ కళాశాల మైదానంలో జరిగే సభకు పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. పాంచ జన్య సంకల్పం లక్ష్యాలు, సిద్ధాంతాలను ఆమె వివరిస్తారని పేర్కొన్నారు.

ఉచిత విద్య, ఉచిత వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలపై సభలో చర్చిస్తారని తెలిపారు.

ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి, విద్యా-వైద్య సౌకర్యాలపై చైతన్యం కల్పించడమే సభ ఉద్దేశమన్నారు. నారాయణపేటతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

# కలెక్టర్ బంగ్లాలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అర్బన్ సెప్టెంబర్ 19(జనంసాక్షి):** మహబూబ్ నగర్ కలెక్టర్ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం పాల్గొన్నారు. అంతకుముందు బంగ్లా ఆవరణలో ప్రతిష్టించిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



**చేర్యాల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని సిద్దిపేట అడిషనల్ డీసీపీ కుషల్కర్ అన్నారు. సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా కడవేరుగు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇళ్లు, దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా అధ్యక్షత న జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వికలాంగులు, వితంతువుల పింఛన్ల పరిశీలన





**ఉప్పునుంతల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం ఉప్పరిపల్లి గ్రామంలో శనివారం వికలాంగులు, వితంతువుల పింఛన్ల పరిశీలన ప్రక్రియను గ్రామ సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్‌రెడ్డి ప్రారంభించారు. పింఛన్లకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అర్హతలను నిర్ధారించే ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి మహేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌చారి, వార్డు సభ్యురాలు దెంది భారతమ్మతో పాటు గ్రామ పెద్దలు శేఖర్‌రెడ్డి, ఎం.శేఖర్‌గౌడ్, కి.శేఖర్‌గౌడ్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

## చుంచనకోటలో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం



**చేర్యాల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చుంచనకోట గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి బైర నరేందర్, సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని నాలుగేళ్లు నిండిన బాలబాలికలను ప్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చేరేలా తల్లిదండ్రులు, గ్రామస్థులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జి.జ్యోతి, జ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**గోపాలపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రీడా పోటీలు శనివారం ఉత్సాహంగా ముగిశాయి. వివిధ పాఠశాలలకు చెందిన 300 మందికిపైగా బాలబాలికలు కోకో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో మండల జట్లను ఎంపిక చేశారు. బాలికల కబడ్డీలో టీజీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ బుద్ధారం, బాలుర కబడ్డీలో జడ్పీహెచ్‌ఎస్ ఏదుట్ల ప్రథమ స్థానాలు సాధించాయి. బాలికల కోకోలో బుద్ధారం, బాలుర కోకోలో జడ్పీహెచ్‌ఎస్ గోపాలపేట విజేతలుగా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.



## జర్నలిస్ట్ పరిపూర్ణంకు గౌరవ డాక్టరేట్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎరుకలి పరిపూర్ణంకు గౌరవ డాక్టరేట్ లభించింది. పత్రికా రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ సామాజిక చైతన్యం, మూఢ నమ్మకాలు, సాంఘిక వివక్ష, ప్రజా సమస్యలపై కథనాలు అందించినందుకు ఈ గౌరవం దక్కింది. శనివారం పాండిచ్చేరిలోని షణ్ముగ రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్, జర్మనీ ప్రతినిధి జార్జ్ పీటర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన 26 మందికి ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. సమాజ సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని జార్జ్ పీటర్ సూచించారు. పరిపూర్ణం గతంలోనూ ఉత్తమ జర్నలిస్టుగా పలు అవార్డులు అందుకున్నారు. 2012, 2013లో వీఆర్ బొమ్మిరెడ్డి అవార్డులు, రోనాల్డ్ రోజ్ ఉత్తమ జర్నలిస్టు అవార్డుతోపాటు ఇతర పురస్కారాలు పొందారు. తాజా గౌరవంపై జర్నలిస్టు మిత్రులు, సహచరులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- **నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు: జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**వనపర్తి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** గణనాథుల నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని నల్లచెరువు నిమజ్జన ప్రదేశంతో పాటు శోభాయాత్ర మార్గాన్ని పోలీసు అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.

నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. శోభాయాత్ర మార్గంలో సీసీ కెమెరాల నిఘా, బారికేడ్లు, లైట్లు, క్రేన్లు, మంచినీటి సౌకర్యం, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఉత్సవ కమిటీలు పూజలను త్వరగా ముగించి వెలుతురు ఉండగానే విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని సూచించారు.

శోభాయాత్రలో డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమని స్పష్టం చేశారు. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై చిన్నారులు, మహిళలు జాగ్రత్తగా ప్రయాణించాలని, ప్రమాదాలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధ రత్నం, ఎస్సైలు హరిప్రసాద్, హృషికేష్, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## కృష్ణ మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



**కృష్ణ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రహమాన్‌కు సమస్యలను వివరించారు. కున్సీ, ముడుమాల్, ఆలంపల్లి, తంగిడిగి, కృష్ణ సర్పంచులు విద్యుత్ ఏఈ ధర్మతేజను ప్రశ్నించారు. వైర్లు వేలాడుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఏఈ నెల రోజుల్లో పాత స్తంభాలను మార్చి, లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కృష్ణ సర్పంచ్ నాగేందర్ సత్యసాయి బాబా వాటర్ సక్రమంగా రావడం లేదని తెలిపారు. ఆలంపల్లి సర్పంచ్ తాయమ్మ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. ముడుమాల్ సర్పంచ్ బాలరాజు గ్రామకంతం భూమిని సర్వే చేయాలని కోరగా తహసీల్దార్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నారాయణ ఖేడ్ కు చెందిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ని నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసిసి అధ్యక్ష పదవికి జిల్లాలో పలువురు ప్రముఖ నాయకులు పోటీపడ్డ చివరికి మారుమూల ప్రాంతమైన ఖేడ్ కు చెందిన చంద్రశేఖర్ రెడ్డికి పదవి వరించింది.

1990 నుంచి 1992 వరకు జేఎన్టీయూ విశ్వవిద్యాలయంలో ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘ నాయకునిగా, 1996- 1999 వరకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2000- 2005 వరకు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షునిగా, 2008- 2014 వరకు డిసిసి కార్యదర్శిగా, 2015- 2025 వరకు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.





మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కృష్ణారెడ్డి కుమారుడైన ఈయన ప్రస్తుత ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి స్వయాన సోదరుడు. కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్న మారుమూల ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి కి పదవి వరించడం పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సీనియర్ జర్నలిస్టు
# శ్రీనివాస్‌కు పితృ వియోగం



- శ్రీనివాస్‌ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ తండ్రి మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు శనివారం మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్ట్ శ్రీనివాస్‌ను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


## నీట్‌లో సత్తాచాటిన ఆశ్రితకు ఘన సన్మానం



మద్దూరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): మద్దూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని సిపిరి ఆశ్రిత నీట్ 2026లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ ఈ ఎస్ ఐ మెడికల్ కాలేజీలో వైద్య విద్యకు సీటు సాధించింది. స్వర్గీయ ఆనంద్-అనసూయ దంపతుల కుమార్తె అయిన ఆశ్రితను శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాలాజీ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి మెడికల్ సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఆశ్రిత విజయం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఆమెను అభినందించి, భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ఖాజీపూర్ పాఠశాలకు
# ఉపాధ్యాయులను కేటాయించాలి

- డీఈఓకు సర్పంచ్ సాయప్ప వినతి



మద్దూరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): ఖాజీపూర్ గ్రామంలోని ఎం.పి.యు.పి.ఎస్. పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ యం.సాయప్ప కోరారు. పాఠశాలలో ఇద్దరు రెగ్యులర్, ఒక కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని, రెండు పోస్టులు ఖాళీగా ఉండటంతో 6, 7 తరగతుల విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై లేదా వాలంటీర్‌గా కేటాయించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

## పద్మశాలి
# పరిచయ వేదికకు సహకరించాలి

నారాయణపేట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): పట్టణంలో త్వరలో పద్మశాలి పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్ తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి కుటుంబాల మధ్య పరిచయాలు పెంపొందించేందుకు వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నెల రెండో ఆదివారం భక్త మార్కండేయ కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా పరిచయ వేదిక సంఘం సభ్యులు నరహరి శంకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి తిలక్‌బాబు, ఉపాధ్యక్షుడు సంబరి శ్రీనివాస్, కోశాధికారి కర్లీ నరసింహులు, ప్రచార కార్యదర్శి కర్లీ దేవి వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

# పిల్లలకు బాల ఆధార్ తప్పనిసరి...





- 0-5 ఏళ్ల పిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేయాలి
- పిల్లలు పుట్టిన వెంటనే నమోదు చేయించాలి
- ఐదేళ్ల తర్వాత ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి
- మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ టౌన్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): 0 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు బాల ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శనివారం మెదక్ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ నమోదు కేంద్రంలో కలెక్టర్ ప్రతిమాసింగ్, శుభం సింగ్ దంపతులు తమ పిల్లలు ఏకాంషి, అద్విత్‌ల ఆధార్ నమోదును పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల కోసం యూఐడీఏఐ ప్రత్యేకంగా బాల ఆధార్‌ను అందు బాటులోకి తీసుకొచ్చిందన్నారు. 0 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు జారీ చేసే బాల ఆధార్ నీలిరంగులో ఉంటుందని తెలిపారు. పిల్లలకు ప్రత్యేక గుర్తింపుగా ఉపయోగపడే ఈ కార్డు పాఠశాలల్లో ప్రవేశాలు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు పొందడంలో ఉపకరిస్తుందని వివరించారు. పిల్లలు పుట్టిన వెంటనే తల్లిదండ్రులు బాల ఆధార్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఐదేళ్లు పూర్తయిన తర్వాత ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని, 15 నుంచి 17 ఏళ్ల మధ్య మరోసారి అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు. జిల్లాలో 0-5 ఏళ్ల పిల్లల ఆధార్ నమోదును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించి ప్రభుత్వ సేవలను సులభంగా పొందేలా చూడాలని కలెక్టర్ కోరారు.

# విద్యతోపాటు మానవీయ విలువలు పెంపొందించాలి





- విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర
- భాషా నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ అవసరం
- హిందీ ఉపాధ్యాయులకు సన్మానం
- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బోధనతోపాటు వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్ కర్నూల్‌లోని వెలుమ ఫంక్షన్‌హాల్‌లో రిక్‌గ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమన్నారు. భాషల పరిరక్షణతోనే సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయని తెలిపారు. హిందీపై ఆసక్తి పెరిగేలా సరళమైన, ఆకర్షణీయమైన బోధనా పద్ధతులు అవలంబించాలని సూచించారు. విద్య కేవలం మార్కులకే పరిమితం కాకుండా బాధ్యతాయుత ఆలోచన, నైతిక విలువలు, సామాజిక స్పృహ కలిగిన పౌరులను తీర్చిదిద్దాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్ మాట్లాడుతూ హిందీ ప్రాధాన్యంతోపాటు దేశంలోని వివిధ భాషలు, సంస్కృతుల పట్ల విద్యార్థుల్లో గౌరవభావం పెంపొందించాలని సూచించారు. పదో తరగతి హిందీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

రిక్‌గ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ భాషా నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హిందీ సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే, డీఈఓ సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, హిందీ ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కొండారెడ్డిపల్లి చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన
- 15 అడుగులకు పైగా విగ్రహాలకు ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిమజ్జనానికి భక్తులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. చెరువులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున భక్తులు ప్రమాదవశాత్తు నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు, రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, లైఫ్ సేవింగ్ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

రాత్రివేళల్లోనూ నిమజ్జనం జరిగే అవకాశం ఉన్నందున తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, వాహనాల రద్దీ నియంత్రణకు పార్కింగ్, ట్రాఫిక్ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించి అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు సులభంగా చేరుకునేలా మార్గాలను ఖాళీగా ఉంచాలని సూచించారు.

చెరువులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున 15 అడుగులకు పైగా ఎత్తున్న విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేయకుండా కృష్ణా నది లేదా అధికారులు గుర్తించిన ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఇందుకోసం రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మారుతీ వ్యాన్‌ను ఢీకొన్న బైక్ - యువకుడు దుర్మరణం

- భూత్పూర్ మండలం కొత్తమొల్గరా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం








**భూత్పూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** భూత్పూర్ మండలం కొత్తమొల్గరా గ్రామ సమీపంలోని తుల్జా భవాని తాండ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మారుతీ వ్యాన్‌ను బైక్ ఢీకొనడంతో బైక్ పై ఉన్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మద్దిగట్ల గ్రామానికి చెందిన గుండుమల్ల త్రినాథ్ (20) మహబూబ్ నగర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

శుక్రవారం తన స్వగ్రామం నుంచి మోటార్ సైకిల్ పై మహబూబ్ నగర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో శ్రీశైలం వైపు వెళ్తున్న మారుతీ వ్యాన్ ను ఢీకొన్నాడు.

**టైర్ పేలడంతో అదుపుతప్పి...**

ప్రమాద సమయంలో బైక్ టైర్ పేలడంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో త్రినాథ్ తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. త్రినాథ్ మృతితో మద్దిగట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మట్టి గణపతికి కలెక్టర్ ప్రత్యేక పూజలు

- నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి
- మూడు బేబీ కుంటలు సిద్ధం
- పెద్ద విగ్రహాలకు బీచుపల్లిలో ఏర్పాట్లు
- ప్రశాంత నిర్వహణకు సహకరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించాలని కోరారు. శనివారం తెలంగాణ చౌరస్తా సమీపంలోని శ్రీ గణేష్ భవన్‌లో జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది ప్రజలకు మంచి సందేశాన్ని అందిస్తుందని తెలిపారు.

**మూడు బేబీ కుంటలు సిద్ధం...**

మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఐదు అడుగుల లోపు విగ్రహాల నిమజ్జనం కోసం మూడు కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అప్పన్నపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు, పంచవటి పాఠశాల సమీపంలోని పార్కు వద్ద ఒక కుంటను సిద్ధం చేసినట్లు వివరించారు.

**పెద్ద విగ్రహాలకు బీచుపల్లి...**

పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం బీచుపల్లి వద్ద నీరు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం గద్వాల జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి, వీహెచ్‌పీ అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి ఎం.బాలయ్య, నగర అధ్యక్షుడు రెబ్బ విఘ్నేష్, కార్పొరేటర్లు ప్రవీణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

- పంచజన్య లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మానకొండూరు కాన్సెన్సీ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య




**బెజ్జంకి,సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండల కేంద్రంలో శనివారం మండల ఇన్చార్జ్ ఎర్రవెల్లి మహేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన(టీఆర్‌ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన పంచ జన్య లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కార్యక్రమంలో మొదట గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీఆర్ ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం టీఆర్‌ఎస్ పార్టీ మానకొండూర్ కాన్సెన్సీ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ ఉచిత విద్య,ఉచిత వైద్యం,రైతు సంక్షేమం,ఉద్యోగ అవకాశాలు, సామా జిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ పార్టీ ముందుకు సాగుతుంది అనీ అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, ప్రజా సంక్షేమం,సామాజిక న్యాయం లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు చెన్నమల్ల చైతన్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట్ బాధ్యుడు చల్లా మల్లారెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల మల్లారెడ్డి,జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి, కరీంనగర్ ఇన్‌చార్జి అంకెం శివరాణి, రాగనేని లక్ష్మణ్, నియోజకవర్గ నాయ కులు అతహర్, పరశురాములు, మేకల తిరుపతి, మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మారటి వెంకటేష్, పర్ణ, గౌతమి, సల్మా తదితరులు పాల్గొన్నారు.

# పూరి బీచ్‌లో ఎమ్మెల్యే గూడెం సైకత శిల్పం

- జన్మదిన సందర్భంగా అభిమానాన్ని చాటుకున్న నాయకులు




**పటాన్చెరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి 63వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతా ల్లో అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా కొన సాగుతున్నాయి. ఎమ్మెల్యే జీఎంఆర్‌పై తమకున్న అభిమానాన్ని వినూత్న రీతిలో చాటుకునేందుకు పలువురు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఒడిశా రాష్ట్రంలోని ప్రఖ్యాత పూరి సముద్ర తీరంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేరుతో ప్రత్యేకంగా సైకత శిల్పాన్ని రూపొందించారు. పటాన్చెరు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షులు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక సైకత శిల్పాన్ని తయారు చేయించారు.ప్రస్తుతం పూరి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా బీచ్‌కు చేరుకొని సైకత శిల్పాన్ని వీక్షించారు. తనపై అభిమానంతో ప్రత్యేకంగా సైకత శిల్పాన్ని రూపొందించిన చెన్నారెడ్డిని అభినందించారు. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజా సేవకు అంకితం చేయడం అభినందనీయమని పేర్కొంటూ, తనపై అభిమానంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బీరంగూడ ఆలయాన్ని సందర్శించిన హైదరాబాద్ సిపి సజ్జనర్



**అమీన్పూర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్ శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడిని ఆయన దర్శించుకున్నారు.

అనంతరం ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ సీపీ సజ్జనర్‌ను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ దండు రమేష్ యాదవ్ , మల్లేష్ యాదవ్, బిక్షపతి, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ నాయక్,పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయం అయిజ బస్టాండు

- ఏటా కేవలం అద్దే రూపేణా 70షాప్స్ 2.50 కోట్లు
- నిత్యం 102 బస్సులు రాకపోకలు
- హోటల్,మంచినీరు,టాయిలెట్స్,సి సి కెమరాలు, సి సి రోడ్ కూడా లేవు
- కనీస వసతులు లేని బస్టాండ్



**అయిజ సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, అయిజ బస్టాండ్ పలు సమస్యలతో విలయమాడుతుందని అన్నారు. ముఖ్యంగా గత మూడు సంవత్సరాల నుంచి ఈ బస్టాండ్ కు 3 కోట్ల రూపాయలు నిధులు ఇచ్చి అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని పలుమార్లు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం జరిగింది.

కానీ కేవలం 40 లక్షల రూపాయలు మాత్రమే ఇవ్వడం జరిగింది. ఇది ఏ మూలన సరిపోవు పనులు కూడా నాణ్యత లోబహిష్టంగా ఉన్నాయి.ముఖ్యంగా డిపో మేనేజర్, రీజినల్ మేనేజర్ కి మా పార్టీ తరుపున డిమాండ్ చేయడమేమంటే ఈ యొక్క బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీకి సంబంధించి 70 సెటర్లకు పైగా షాపింగ్ కాంప్లెక్స్ పై ఉన్నాయి ఏటా 2.50 కోట్ల అద్దె వస్తుంది అదేవిధంగా ప్రతిరోజు వివిధ రాష్ట్రాలకు ఈ బస్టాండ్ నుండి 102 బస్సులు వచ్చిపోతున్నాయి. ఎలాంటి వసతులు లేవు కనీసం టాయిలెట్స్ కూడా సరిగా లేవు. హోటల్ లేకపోవడం వల్ల ప్రయాణికులు బయట వెళ్లి టిఫిన్లు టీలు భోజనాలు చేసి రా వచ్చే లోపల బస్సు ఉంతుందో పోతుందని చాలామంది ఆందోళన పడుతున్నారు.అదేవిధంగా కనీసం మంచినీటి సౌకర్యం లేదు.బస్టాండ్లో కనీసం సీసీ కెమెరాలు కూడా లేవు.మా డిమాండ్ ఒకటే ఈ బస్టాండ్ 40 సంవత్సరాల క్రితం నిర్మించినారు. దీన్ని పూర్తిగా తీసి నూతన బస్టాండ్ నిర్మాణం చేసి ఇది సెంటర్ లో ఉంది సెంటర్లో కాకుండా ఒకవైపు నిర్మించి నూతనంగా నిర్మించాలని ఎందుకంటే సెంటర్లో ఉండడం వల్ల చాలా ఇబ్బంది అవుతుంది. దీన్ని నూతనంగా ఒకవైపు నిర్మించి అదే విధంగా అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఇంత ఆదాయం ఉన్నటువంటి బస్టాండ్ ఎక్కడ లేదు. కాబట్టి వెంటనే మేము ఇచ్చినటువంటి ప్రతి డిమాండ్ నెరవేర్చాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అయిజ మండల అధ్యక్షులు ,గోపాలకృష్ణ, కంపాటి భగత్ రెడ్డి,లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాలుగొన్నారు.

# ఆధునిక సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

- **వాతావరణం, మార్కెట్‌కు అనుగుణంగా ఆరుతడి పంటల ఎంపికపై దృష్టి సారించాలి**
- **కిసాన్ మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19(జనంసాక్షి):** రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకొని సాగు ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించే దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.

శనివారం బిజినపల్లి మండలం పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, రైతు--శాస్త్రవేత్తల సమావేశం, వ్యవసాయ ప్రదర్శనను రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు ఏవీఎన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. వివిధ పంటల సాగు విధానాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటల సంరక్షణ పద్ధతులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంటల సాగుకు ముందు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకొని భూసారానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న రబీ సీజన్‌లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, పంటల వైవిధ్యీకరణపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని కోరారు. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు నేల సారవంతత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు, పురుగుమందులను వినియోగిస్తూ సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించాలని సూచించారు.




వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సూక్ష్మ సాగునీటి, ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు కేవలం పంటల ఉత్పత్తిపైనే కాకుండా నాణ్యత, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అంశాలపై కూడా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం, రైతు సమూహాలుగా ఏర్పడి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి శాస్త్రీయ పరిష్కారాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ, సంక్షేమ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ...**

రైతులు పంటల సాగుకు ముందు పూర్తిస్థాయి అవగాహన కల్పించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పంటల మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని అందిపుచ్చుకొని లాభదాయకమైన వ్యవసాయానికి బదిలీ కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కిసాన్ మేళాలో నిర్వహించిన రైతు--శాస్త్రవేత్తల సమావేశంలో రైతులు తమ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి








తీసుకెళ్లారు. తెగుళ్లు, చీడపీడల నివారణ, ఎరువుల వినియోగం, అధిక దిగుబడుల సాధన, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ కృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, జిల్లా భూగర్భ జల అధికారిణి దివ్యజ్యోతి, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శైల, వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాండల్లో వెలుగుల జాడలు!

- **చీకటి సమస్యకు చెక్ పెట్టేలా ఎల్ఈడి లైట్ల పంపిణీ**
- **ప్రతి తాండలో వెలుగులు నింపడమే లక్ష్యం: కె. ప్రసాద్ రెడ్డి**

కోహిర్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి): రాత్రి పడితే చీకటిలో మగ్గే గిరిజన తాండల్లో ఇక వెలుగులు నింపేందుకు చర్యలు చేపడుతున్నామని జహీరాబాద్ అసెంబ్లీ నాయకులు కె. ప్రసాద్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని గిరిజన తాండల్లో వీధి వెలుగుల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎల్ఈడి లైట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తాండల్లోని ప్రతి వీధి చీకటి రహితంగా మారాలన్నదే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా గోపి నాయక్ తాండ, లాల్‌సింగ్ తాండ, బడంపేట్ తాండ, మన్యార్పల్లి తాండలకు ఎల్ఈడి లైట్లను అందజేశారు. గతంలో సేడియర్ గుట్ట తాండకు కూడా ఎల్ఈడి లైట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. తాండల్లో రాత్రివేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వెలుగులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**చీకటిలో తాండలు.. వెలుగుల కోసం ఎదురుచూపులు...**

ఏళ్లుగా తాండల్లో మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వీధుల్లో సరైన వెలుతురు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. చీకటి వీధుల్లో విషపురుగులు, పాముల భయం కూడా ఉంటుందని పలువురు తాండ వాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎల్ఈడి లైట్ల ఏర్పాటు తమకు ఉపయోగకరంగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేశారు.

**తాండల సమస్యలపై దృష్టి...**

ఎల్ఈడి లైట్ల పంపిణీతో పాటు తాండల్లో నెలకొన్న ఇతర మౌలిక సమస్యలను కూడా సంబంధిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రసాద్ రెడ్డి స్వయంగా తాండలకు వచ్చి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం సంతోషంగా ఉందని తాండ వాసులు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు తాండల నుంచే ప్రారంభించడం ద్వారా గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనే భావన కలుగుతోందన్నారు.

**వెలుగులతో మారనున్న రాత్రి దృశ్యం...**

ఎల్ఈడి లైట్లు ఏర్పాటు కావడంతో ఇంతకాలం చీకటిగా కనిపించిన తాండ వీధులు రాత్రివేళల్లో వెలుగులతో కళకళలాడనున్నాయి. ప్రజల భద్రతతో పాటు రాత్రివేళల్లో రాకపోకలకు కూడా సౌకర్యం కలగనుందని స్థానికులు తెలిపారు.

మిగిలిన తాండల్లోనూ అవసరమైన ప్రాంతాలను గుర్తించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పిచరాగడి తాండ సర్పంచ్, కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, సజ్జాపూర్ ఉప





సర్పంచ్ మైసయ్య, గుడిగ్యార్ పల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ కాంటెస్టెడ్ అభ్యర్థి సుభాష్ రాథోడ్,లాల్ సింగ్ తాండ వార్డు సభ్యులు సంతోష్ రాథోడ్, జైపాల్ నాయక్,సుధాకర్, నాగేష్, కిషన్,మోతిరం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.